క్లుప్తంగా

తవ్వారు.. పూడ్చడం మరిచారు



పాన్‌గల్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ప్రధాన రోడ్డు పక్కన తాగునీటి పైపులైన్ల లీకేజీల మరమ్మతు నిమిత్తం తవ్విన కాల్వను పూడ్చటం మరిచారు. మరమ్మతు నిమిత్తం తవ్వి 15 రోజులు కావస్తున్నా నేటికీ పూడ్చకపోవడంతో రాత్రి వేళల్లో రోడ్డుపక్కన తవ్విన కాల్వలో పడే ప్రమాదం ఉందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తవ్విన కాల్వను పూడ్చి ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



వనపర్తి: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా ఇష్టారీతిన చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని గోపాల్‌పేట ఎస్‌ఐ హరిప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన సిబ్బందితో కలిసి గోపాల్‌పేట నుంచి ఏదుట్ల వెళ్లే దారిలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారుల లైసెన్స్, ఆర్సీ, హెల్మెట్లను పరిశీలించడంతో పాటు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేశారు. తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పట్టుబడిన వాహనదారులకు చెకింగ్ అనంతరం ట్రాఫిక్ రూల్స్, మోటార్ వెహికిల్ చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయనతో పాటు రైటర్ వంశీ, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్పీ విచారణ



పెద్దకొత్తపల్లి: లోక్ సభ ఎన్నికల సందర్భంగా చిన్నకార్పాములలో బీజేపీ కార్యకర్త గన్యాగుల విజయ్‌పై అదే గ్రామానికి చెందిన మైసమ్మ చైర్మన్ శ్రీనివాసులు అతని అనుచరులు దాడి చేయగా.. వారిపై గన్యాగుల విజయ్ ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయించారు. నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్ బుధవారం గ్రామానికి వెళ్లి గ్రామపంచాయతీ వద్ద బహిరంగ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల అనంతరం ప్రజలు దాడులకు పాల్పడకుండా శాంతియుతంగా జీవించాలని సూచించారు. గొడవలు పడితే మీరే నష్టపోతారని సూచించారు. విచారణలో ఎస్‌ఐ సతీష్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీర్చండి



కోడేరు: మండలంలోని నర్సాయిపల్లిలో తాగునీటి సమస్య తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. దాదాపు నెల రోజులు కావొస్తున్నా.. గ్రామ ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడం లేదని వాపోయారు. వేసవి కాలం కావడంతో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఐకేపీ కార్యాలయంలో సామాజిక తనిఖీ



కోడేరు: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో 2023–24 సంవత్సరం వరకు ఎంత ఖర్చు చేశారు. రికావరీ ఎంత చేశారు అనే దానిపై బుధవారం జిల్లా మైక్రో ఫైనాన్స్ అధికారులు శ్యాంసుందర్, సురేష్, భార్గవ్ సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మండలంలో స్త్రీనిధి కింద రూ.3 కోట్ల రుణం ఇవ్వడం కోసం లక్ష్యం పెట్టుకోగా.. రూ.2 కోట్ల రుణాలు ఇచ్చామన్నారు. మహిళా సమాఖ్య ద్వార గ్రామ సంఘాలకు కోడేరు, తీగలపల్లి, పస్పుల, మాచుపల్లి, రాజాపూర్, రేకులపల్లి, ఎత్తంలో రూ.14 లక్షల రుణాలు ఇచ్చామన్నారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించడంపై సోషల్ ఆడిట్ నిర్వహించడం జరిగిందన్నారు.

అభివృద్ధి వైపు అడుగులు

- నాడు వర్తక వ్యాపారంలో మరో ముంబాయి
- కాలక్రమేణా కనుమరుగు
- మదనాపురం మండల కేంద్రంగా ఏర్పడడంతో వేగంగా పురోగతి



పోలీస్‌స్టేషన్ భవనం



మండల కేంద్రంలో సంత

మదనాపురం: నాడు మదనాపురం వర్తక వ్యాపారంలో ఎంతో ప్రఖ్యాతి చెందింది. కానీ కాలక్రమేణా తన శోభను కోల్పోతూ మామూలు గ్రామంగా మిగిలింది. జిల్లాల పునర్విభజనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మదనాపురంను మండల కేంద్రంగా ఏర్పాటు చేయడంతో మళ్లీ అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది. వనపర్తికి చెందిన రైల్వే స్టేషన్ ఇక్కడ ఉండడంతో నిత్యం వందలాది మంది ప్రయాణికులు ఇక్కడికి వస్తుంటారు. వనపర్తి, కొత్తకోట, పెబ్బేరు, అడ్డాకల్, ఆత్మకూర్, అమరచింత, చిన్నచింతకుంట మండలాలకు చెందిన ప్రజలు తిరుపతి, హైదరాబాద్, హుబ్లీ, రాయిచూర్, గుంటూరు, పుణె, ముంబాయి, బెంగుళూరు, యశ్వంత్‌పూర్, రామేశ్వరం తదితర నగరాలకు వెళ్లాలంటే ఇక్కడి నుంచే రైళ్లు ఎక్కాల్సి ఉంది. దీంతో వ్యాపారాలు ఊపందుకున్నాయి.

నూతన సొగసులు

మదనాపురం మండలంలో ప్రస్తుతం 17 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జిల్లా పునర్విభజనకు ముందు వ్యాపార, వాణిజ్యపరంగా కొంత నిరాశజనకంగా ఉన్నా.. తరువాత వచ్చిన అనేక మార్పుల కారణంగా అభివృద్ధిలో దూసుకెళ్తుంది. రామన్‌పాడు, సరళాసాగర్ రిజర్వాయర్ వంటి పర్యాటక ప్రదేశాలు మండల కేంద్రానికి సమీపంలో ఉండడంతో పర్యాటకులు తాకిడి ఉంటుంది. మండల కేంద్రంగా ఏర్పాటు చేయడంతో ప్రభుత్వ భవనాలు మంజూరు కానున్నాయి. కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలతో పాటు పాటు హార్టికల్చర్ కళాశాల, కృషి విజ్ఞాన కేంద్రం, సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్, వ్యవసాయ శాఖ, మండల మహిళ సమాఖ్య కార్యాలయం, పోలీస్‌స్టేషన్ భవనంతో అనేక ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయడంతో ప్రజలకు పాలన సులభతరమైంది.

వారాంతపు సంతతో

మండల కేంద్రంలో ప్రతి సోమవారం జరిగే సంత ప్రధాన ఆకర్షణగా ఉంటుంది. కూరగాయలు తక్కువ ధరలకే వినియోగదారులకు అందుబాటులో ఉంటాయి. వనపర్తి, కర్నూల్, మహబూబ్‌నగర్, అడ్డాకుల, పెబ్బేరు, ఆత్మకూర్ తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు సంతలో వ్యాపారం కొనసాగిస్తారు. రైల్వే స్టేషన్ ఉండడంతో సుదూర ప్రాంతాల నుంచి కూడా వ్యాపారులు వచ్చి తమ సామగ్రి విక్రయిస్తూ లాభాలు గడిస్తున్నారు.

నూతన శోభ వచ్చింది



మండల కేంద్రం ఏర్పాటు కావడంతో మా గ్రామంలో నూతన శోభ సంతరించుకుంది. వివిధ పనుల నిమిత్తం చుట్టు పక్కల గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుండడంతో వ్యాపారులు జోరుగా సాగుతున్నాయి. కృషి విజ్ఞాన కేంద్రంతో మదనాపురం మండలానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. రానున్న రోజుల్లో చాలా అభివృద్ధి చెందుతుందని భావిస్తాను.

– రాజశేఖర్‌రెడ్డి, మదనాపురం

ఆదర్శంగా తీర్చిదిద్దాలి



మదనాపురం మండల కేంద్రాన్ని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చేయూతతో ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతాం. రాజకీయ పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేసుకునేందుకు అందరి సహకారం అవసరం. రైల్వే, రోడ్డు మార్గాలు ఉండడంతో మదనాపురం మండలానికి వ్యాపారపరంగా మంచి భవిష్యత్ ఉంది. పాలకులు దీనిపై మరింత దృష్టి పెడితే జిల్లాలోనే మదనాపురం ఆదర్శ మండలంగా గుర్తింపు పొందుతుంది.

– ఆవుల రాఘవేదర్

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



బాధితులకు ఎల్‌ఓసీ చెక్కును అందిస్తున్న జిల్లెల ఆదిత్యరెడ్డి

పెబ్బేరు రూరల్: మండలంలోని బూడిదపాడుకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి అనారోగ్య సమస్యతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పదించిన ఆయన రూ. 2.30 లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. మంజూరైన ఎల్‌ఓసీ కాపీని మంగళవారం వనపర్తిలోని వారి ఇంటి వద్ద ఏఐసీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ జిల్లెల ఆదిత్యరెడ్డి బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గొని కోదండరామిరెడ్డి, కృపాకర్‌రెడ్డి, బునాదిపురం నరేందర్, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

28న సవారమ్మ జాతర

అమరచింత: పట్టణ శివారులో వెలసిన సమరమ్మ దేవత జాతర ఈనెల 28న మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు వాటర్ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. 27న ఆలయం ఆవరణలో పందిరి వేయడంతో పాటు అమ్మవారి మూల విగ్రహాలకు కృష్ణానది జలాలతో ప్రత్యేక అభిషేకం చేయడంతో పూజలు నిర్వహిస్తామన్నారు. 28న అమ్మవారికి బోనాలతో పాటు కోళ్లను బలిచ్చి భక్తులు తమ మొక్కులను చెల్లించుకుంటారని తెలిపారు. ప్రతి సంవత్సరం అమ్మవారి జాతర నిర్వహించి మొక్కులు చెల్లించడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ అని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

అందుబాటులో ఆర్‌ఎన్‌ఆర్ వరి విత్తనాలు



అమరచింతలో రైతులకు వరి విత్తనాలను అందిస్తున్న ఏఈఓ

అమరచింత: మండలంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రాల్లో 25 కేజీల ఆర్‌ఎన్‌ఆర్ వరి విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి వినయ్ కుమార్ తెలిపారు. 25 కేజీల ఆర్‌ఎన్‌ఆర్ వరి విత్తనాలను సబ్సిడీతో రూ.1,094 అందిస్తున్నామని వెల్లడించారు. వీటితో పాటు జీలుగ విత్తనాలను అందిస్తున్నామన్నారు. రైతులు పట్టాదారు పాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను వ్యవసాయ కార్యాలయంలో అందించి పర్మిట్ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: భూసారాన్ని పెంపొందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీ రూపంలో పచ్చిరొట్ట, జీలుగ విత్తనాలను అందజేస్తుందని, వీటిని తీసుకొని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్ తెలిపారు. 30 కేజీల బస్తా 60 శాతం సబ్సిడీ పోగా రూ.1,116 లకు రైతులకు అందజేస్తామన్నారు. అవసరమైన రైతులు గ్రామాల్లోని రైతు వేదికల్లో ఉంటున్న వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి విత్తనాలను అవసరమైన రైతులు పర్మిషన్ రాయించుకోవాలని ఆయన సూచించారు. పట్టదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను ఏఈఓల వద్దకు తీసుకెళ్లాలని ఆయన కోరారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

కొల్లాపూర్: మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ హెచ్చరించారు. మున్సిపాలిటీలో నూతనంగా నిర్మాణాలు చేపట్టేవారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకున్న తర్వాతనే నిర్మాణాలు చేపట్టాలన్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టేవారికి అపరాధ రుసుం విధించడం జరుగుతుందన్నారు. రహదారులు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపడితే వాటిని కూల్చి వేస్తామన్నారు.

మారెమ్మ, సవారమ్మ జాతర



కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె, మైలగడ్డ, గ్రామాల్లో మారెమ్మ, సవారమ్మ జాతరను బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఆలయం దగ్గరకు మహిళలు బోనాలతో వెళ్లి భక్తులు దాసంగాలు, పొట్టేళ్లను బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ పెద్దల సమక్షంలో నిర్వహించిన ఉత్సవాలకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు.

సర్వేతో సరిపెట్టారు

పెద్దకొత్తపల్లి: కేఎల్‌ఐ ప్రాజెక్ట్ కింద ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల కోసం 42 చెరువు కుంటలను ప్రభుత్వం సర్వే చేసి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. కరువుతో అల్లాడుతున్న రైతులకు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల ద్వారా సాగునీరు అందించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 42 చెరువు కుంటలను బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మార్చేందుకు సర్వే చేయించారు. అందులో పెద్దకొత్తపల్లికి చెందిన జాతర కుంట రిజర్వాయర్ ఉంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేఎల్‌ఐ ప్రాజెక్ట్‌పై నిర్మించే 42 బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లను కుదించి 22 రిజర్వాయర్లకు పరిమితం చేసింది. 22 రిజర్వాయర్లకు కూడా ఈ జాతరకుంట రిజర్వాయర్ ఉంది. ప్రస్తుతం ఎక్సైజ్ శాఖ మంత్రి ఉన్న జూపల్లి కృష్ణారావు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి క్యాబినెట్‌లో జూపల్లి కృష్ణారావు పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా పనిచేశారు. 2012 జాతర కుంట గండి రిజర్వాయర్‌కు సర్వే చేయించి ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. ఈ రిజర్వాయర్ నిర్మాణంతో పెద్దకొత్తపల్లి మండలంలోని 10 వేల ఎకరాలకు కరువులో సాగునీరు అందించడంతో పాటు 15 గ్రామాలకు సాగునీటిని అందించవచ్చు. కుమ్మరిగుట్టలో ఉన్న జాతర కుంటకు ఆ గట్టుకు ఈ గట్టుకు కట్ట నిర్మాణం చేపడితే అర టీఎంసీ నీటిని నిల్వ చేసుకోవచ్చు. ఈ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టే ప్రాంతంలో రైతుల భూములు తక్కువగా ఉన్నాయి. కేవలం 56 ఎకరాలకు మాత్రమే ప్రభుత్వం డబ్బులు చెల్లించాల్సి ఉంది. మిగతా భూములన్ని ప్రభుత్వ భూములే కావడంతో జాతర కుంట రిజర్వాయర్ నిర్మాణం చేపడితే కరువు సమయంలో రెండేళ్ల పాటు రైతులకు సాగునీరు అందించవచ్చు. ఈ రిజర్వాయర్ కేఎల్ఐ కాల్వ పక్కన ఉండటంతో వర్షాలు ఎక్కువగా కురిసి వరద సమయంలో రిజర్వాయర్‌లోకి నీటిని కాల్వ ద్వారా వదులుకోవచ్చు. ఈ రిజర్వాయర్ నుంచి కాల్వల ద్వారానే పెద్దకొత్తపల్లి, బాచారం, జొన్నలబొగుడ, సాతాపూర్, కొత్తపేట, కల్వకోల్, చెన్నపురావుపల్లి, గంట్రావ్‌పల్లి, నారాయణపల్లి, యాపట్ల, మారేడుమాన్‌దిన్నె గ్రామాలకు సాగునీరును అందించవచ్చు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ జిల్లా వాసి సీఎం అయినా.. రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి జాతర కుంట రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని రైతులు కోరుతున్నారు.

పాఠశాలకు రక్షణ కరువు



తరగతి గదుల తలుపులు విరగొట్టిన ఆకతాయిలు

అమరచింత: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు రక్షణ కరువైంది. పాఠశాలలోని తరగతి గదుల తలుపులను రాత్రివేళల్లో గుర్తు తెలియని వ్యక్తులు విరగ్గొడుతుండటంతో తరగతి గదుల్లో అసాంఘిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని పట్టణ ప్రజలు తెలిపారు. పాఠశాలకు నైట్ వాచ్‌మెన్ లేకపోవడంతో రాత్రుల్లో గుర్తు తెలియని వ్యక్తులు ఇలాంటి పనులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. పాఠశాల ఆవరణం చుట్టూ సీసీ కెమారాలను పెట్టించినా.. పాఠశాల ముఖద్వారం భాగానికి అమర్చిన సీసీ కెమెరాను కదిలించడంతో అది నేల వాలింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలకు నైట్‌వాచ్‌మెన్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



తలుపులు లేని తరగతి గదిలో బెంచీలు



పాఠశాల ముఖ ద్వారం ఎదురుగా ఒరిగిన సీసీ కెమెరా

పారిశుద్ధ్యం, హరితహారంపై దృష్టి



మాట్లాడుతున్న ఎంపీడీఓ కోటేశ్వర్

పాన్‌గల్: వర్షాకాలం సీజన్ ప్రారంభమవుతున్నందున గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ కోటేశ్వర్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తను సేకరించడం, మురుగు కాల్వలను శుభ్రం చేయించడం వంటి పనులను క్రమం తప్పకుండా చేపట్టాలని, చెత్తను ఇష్టానుసారంగా కాలనీల్లో వేయకుండా డంపింగ్ యార్డులో వేసేలా చూడాలని ఆదేశించారు. ఈ ఏడాదిలో హరితహారంలో నాటేందుకు అవసరమగు మొక్కలను సిద్ధం చేయాలన్నారు. జీపీలకు నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలను పెంచాలన్నారు. ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెంచాలని, ఆధార్ అనుసంధానం పూర్తి చేయాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏపీఓ కుర్మయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పట్టు తప్పితే ప్రమాదమే

- సిమెంట్ రింగులపై ట్రాన్స్‌ఫార్మర్



ఒక పక్కకు ఒరిగి ప్రమాదకరంగా సిమెంటు రింగులపై ట్రాన్స్‌ఫార్మర్

పాన్‌గల్: మండలంలోని మాందాపూర్ సమీపంలో భీమా కాల్వ పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఒక పక్కకు ఒరిగి ప్రమాదకరంగా మారింది. కాల్వ పక్కన సిమెంటు రింగులపై ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ఒక పక్కకు ఒరిగి ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని పరిసరాల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ రోడ్డు గుండా ప్రతినిత్యం ఎంతో మంది ప్రయాణికులు, రైతులు సంచరిస్తుంటారు. విద్యుత్ అధికారులు స్పందించి ప్రమాదం చోటు చేసుకోకముందే ట్రాన్స్‌ఫార్మర్‌ను సరిచేయాలని రైతులు కోరుతున్నారు.

క్రీడాకారులకు క్రికెట్ కిట్లు అందజేత



ముమ్మళ్లపల్లిలో యువకులకు క్రికెట్ కిట్లు అందజేస్తున్న వాకిటి రాజమౌళి

కొత్తకోట రూరల్: మండలంలోని ముమ్మళ్లపల్లి, నిర్వేన్ గ్రామాల్లోని యువకులకు బీజేపీ మండల నాయకుడు వాకిటి రాజమౌళి క్రికెట్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని, అంతే కాకుండా క్రీడల్లో రాణిస్తే జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి గుర్తింపు లభిస్తుందన్నారు. వేసవిలో యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉండేందుకు తన సొంత ఖర్చులతో యువతకు క్రికెట్ కిట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నరేందర్, బ్రహ్మ, మోహన్, శివ తదితరులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం



మురుగు నిల్వను పరిశీలిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్

వనపర్తి టౌన్: నివాసాల మధ్యలో మురుగు నిలిచి దుర్గంధం వెదజల్లడంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతారని, వాటి శుభ్రంగా ఉంచాలని మున్సిపల్ చైర్మన్ పుట్టపాక మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బాల్‌నగర్‌లో నివాసాల మధ్య నిలిచిన మురుగును వారు పరిశీలించారు. కొన్ని నెలలుగా కాలనీలో మురుగు నిలిచి ఉండటంతో పందులు, దోమలు, విష సర్పాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకులు ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించక పోవడం వల్లే ఈ దుస్థితి వచ్చిందని వారు వాపోయారు. మురుగు పారుదలకు ఎలాంటి అవకాశం లేకుండా ఉందని, ఏదో రకంగా మురుగును దారి మళ్లించేందుకు చర్యలు చేపడతామని, పారిశుద్ధ్య సిబ్బందిని అప్రమత్తం చేసి తగిన చొరువ చూపుతామని చైర్మన్, వైస్ చైర్మన్ అన్నారు. దుర్గంధం నివారించేందుకు పరిసర ప్రాంతంల్లో బ్లీచింగ్ పిచికారీ చేయిస్తామన్నారు.

భాగ్యరెడ్డివర్మకు ఘన నివాళి



భాగ్యరెడ్డివర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: హైదరాబాద్ కేంద్రంగా అంబేడ్కర్ కంటే ముందే దళిత వర్గాలను చైతన్యం చేసేందుకు పోరాడిన యోధుడు భాగ్యరెడ్డివర్మ అని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో భాగ్యరెడ్డివర్మ 136వ జయంతిని టీజేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారామ్‌ప్రకాశ్ భాగ్యరెడ్డి వర్మ పోరాటాలను, జీవిత చరిత్రను వివరించారు. కార్యక్రమంలో అఖిలపక్ష ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్‌యాదవ్, కవులు గిరిరాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహాశర్మ, నాయకులు గంధం నాగరాజు, బండలయ్య, బాలేమియా, వెంకటస్వామి, గంధం ఆంజనేయులు, మాధవచారి, సత్యం చారి, నాగరాజు చారి తదితరులు పాల్గొన్నారు.

మల్లాపురంలో సుదర్శన హోమం



పూజల్లో పాల్గొన్న అర్చకులు



ఊరేగింపులో భక్తులు

ఆత్మకూర్: పట్టణ శివారులోని మల్లాపురం శ్రీఆంజనేయస్వామి, శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయం వద్ద ప్రముఖ వేదపండితులు శ్రీనివాసరాఘవన్, వెంకటశేషశర్మ, కిషోర్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీనర్సింహాస్వామివారి కల్యాణోత్సవంలో భాగంగా బుధవారం సుదర్శణ హోమం, ఆరోహణ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం, శుక్రవారం నవకలశాలతో స్వామివారికి అభిషేకం, హోమం, పుణ్యాహవాచనం, విశ్వక్‌సేవ, ఆరాధన, పల్లకీసేవ, ఎదుర్కోళ్లు, గరుడధ్వజారోహణ, యువతి, యువకుల కల్యాణ పూజ, ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు.

కల్వర్టుల నిర్మాణం అయ్యేనా?

- వర్షాకాలంలో ప్రయాణానికి తిప్పలు
- ఏళ్లు గడుస్తున్నా.. గ్రామీణులకు ఎదురుచూపులే..
- ప్రతిపాదనలకే పరిమితం

మానవపాడు: ఎన్నో ఏళ్ల ఆశగా ఎదురుచూస్తున్నా, కల్వర్టుల నిర్మాణం పూర్తికావడం లేదు. మండలంలోని రైతులు, ప్రయాణికులు, వాహనదారులు వర్షకాలం వచ్చిందంటే ఎలా వెళ్లాలో తెలియని పరిస్థితి. పల్లెపల్లెకు అనుసంధానంగా ఉండే గ్రామీణ రోడ్ల వెంట వాగులు, వంకలపై వంతెనలు నిర్మాణం లేక ప్రయాణికులకు, వాహనాదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా, గ్రామాల మధ్య రోడ్లపై రాకపోకలు నిలిచిపోతున్నాయి. మండలంలోని పలు గ్రామాల మధ్య ఉన్న ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన బీటీ రోడ్ల మధ్య ఉన్న వాగులపై వంతెనలు లేక పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు తమ వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు కాడెద్దుల బండ్లతో రోడ్లపై రాకపోకలు సాగిస్తున్నారు. వాగుల వద్ద పలు సందర్భాలలో రైతుల ఎద్దుల బండ్లు ప్రమాదాలకు గురవుతున్నాయి. వర్షాలు వచ్చినప్పుడు కల్వర్టులు లేని వాగుల వద్ద వర్షం వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తూ.. ప్రజల రాకపోకలు స్తంభించిపోతాయి. ప్రజలు సమస్య విన్నవించినప్పుడు అధికారులకు ఆదేశాల జారీ చేసి వెళ్లిపోతున్నారు. ఆచరణలో కల్వర్టుల నిర్మాణం కావడం లేదు.